క్లుప్తంగా

రేపు ఖేల్ ఇండియా సెంటర్ ప్రారంభం

భూపాలపల్లి రూరల్: అంబేద్కర్ స్టేడియంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఖేల్ ఇండియా సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు సోమవారం ప్రకటనలో తెలిపారు. చైర్మన్ రాష్ట్ర క్రీడాధికార సంస్థ హైదరాబాద్ వారి అనుమతితో జిల్లాలో నూతనంగా కబడ్డీ క్రీడకు సంబంధించి జిల్లా స్థాయి ఖేల్ ఇండియా సెంటర్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు , క్రీడాకారులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక లారీ స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మైనింగ్ అధికారులు, పోలీసులు దాడులు జరిపి ఇసుక లారీని, జేసీబీని పట్టుకున్నారు. వారం రోజుల క్రితం చిట్యాల పోలీస్ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అనేక ప్రయత్నాలు చేసి ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం రాత్రి మైనింగ్ అధికారులతో పాటు, పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు జేసీబీని పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లికి చెందిన బీజేపీ యువ మోర్చా నాయకులు పారిపెల్లి శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచంద్రారావు పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, బొడ్డు రాజేందర్, శ్యాం , తదితరులు ఉన్నారు.

నియామకం



మల్హర్: ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ (ఏవైయూ) సొసైటీ రిజిస్ట్రేషన్ 542 జిల్లా ఉపాధ్యక్షుడిగా తాడిచర్ల గ్రామానికి చెందిన కేసారపు సురేందర్ నియామకమయ్యాడు. మండలంలోని కొయ్యూరులో ఆల్ ఎంప్లాయీస్ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శంకర్ నియామక పత్రాన్ని అందించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, జోన్‌ల నాయకులు చింతల కుమార్‌యాదవ్, బండి సుధాకర్‌లకు సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

అడవుల్లో క్లీన్‌డ్రైవ్

ములుగు: డీఎఫ్‌ఓ రాహుల్‌కిషన్ జాదవ్, ఏటూరునాగారం ఎఫ్‌డీఓ అనూజ్ అగర్వాల్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ తాడ్వాయి అటవీ శాఖ సిబ్బంది మూడో విడత క్లీన్‌డ్రైవ్ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మేడారం చుట్టుపక్కల అడవుల్లో చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్‌ను సేకరించి ట్రాక్టర్‌తో డంపింగ్ యార్డుకు తరలించారు. అడవుల్లో బసచేసిన భక్తుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో కృష్ణవేణి, డిప్యూటీ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, ఎఫ్ఎస్‌ఓ లింగం, స్వరూపరాణి, కుమారస్వామి, ఎఫ్‌బీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

గోవిందరావుపేట: భువనగిరి బాలికల మరణం మరువకముందే సూర్యాపేట రూరల్ మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి హాస్టల్‌గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ములుగు జిల్లా ఇన్‌చార్జి పసులాది ముఖేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో సంక్షేమ హాస్టళ్లలో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, స్థానికంగా హాస్టల్ వార్డెన్లు ఉండకపోవడం, నిర్వహణ లోపం వలన ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మాకు ఆరు గ్యారంటీలు అవసరం లేదు, మా పిల్లల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వండి అని అన్నారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.

సర్వాయి పాపన్న అవార్డుల ప్రదానం



చిట్యాల: అవార్డు అందుకుంటున్న శ్రీనివాసాచారి, టీచర్ సతీష్



టేకుమట్ల: అవార్డు అందుకుంటున్న భిక్షపతిగౌడ్

టేకుమట్ల: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ జిల్లా తిరుపతిలోని సౌత్ ఇండియాన్ నేషనల్ 7వ కాన్ఫరెన్స్‌లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మండలంలోని కుందనపల్లికి చెందిన పొన్నం భిక్షపతిగౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బహుజన సాహిత్య అకాడమీ నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం , కేరళ రాష్ట్ర అధ్యక్షుడు కళారాణిల చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. అనంతరం భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ.. సామాజిక రంగాల్లో అందించిన సేవలకు గాను బహుజన సాహిత్య అకాడమీ గుర్తించి నాకు నేషనల్ అవార్డు ఇవ్వడంపై ఆనందంగా ఉందని, అవార్డుతో బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడుతానని ఆయన అన్నారు.

వైద్యరత్నానికి..

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన వెలకంటి శ్రీనివాసాచారి ప్రైవేట్ వృత్తి రీత్యా వైద్యరంగంలో సేవలు అందిస్తున్నారు. దీంతో అతని వైద్య రంగానికి అందిస్తున్న సేవలను గుర్తించి బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా నేషనల్ కమిటీ ఆఫ్ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అవార్డును జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమణ్యం చేతుల మీదుగా సోమవారం తిరుపతిలో అందుకున్నారు.

ఉపాధ్యాయుడికి..

మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన శ్రీవివేకానంద పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గోళ్ళ సతీష్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తమ సర్వీసులను గుర్తించి అవార్డులు ప్రదానోత్సవం చేసిన బహుజన సాహిత్య అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు అందుకున్నవారిని పలువురు అభినందించారు.

బిల్లు చెల్లించలేదని నిరసన

- జీపీ ట్రాక్టర్‌ను తీసుకెళ్లిన మాజీ సర్పంచ్



మాజీ సర్పంచ్ ఇంటి ఆవరణలో నిలిపిన ట్రాక్టర్

మల్హర్: తాను పదవిలో ఉన్న కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకపోవడంతో విసుగు చెందిన మాజీ సర్పంచ్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఇంటి వద్దకు తీసుకెళ్లి నిరసన వ్యక్తం చేసిన ఘటన మండలంలోని చిన్నతూండ్లలో సోమవారం చోటు చేసుకుంది. మాజీ సర్పంచ్ పులిగంటి మమత నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పంచాయతీ బడ్జెట్ ద్వారా తాగునీరు, సైడ్ డ్రైన్స్, లైటింగ్ తదితర అభివృద్ధి పనులను రూ.2.31 లక్షల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. పదవీకాలం ముగియక ముందే ఎంబీ రికార్డు చేసి, చెక్ మేజర్ చేయించుకున్నామన్నారు. బిల్లు చెల్లింపుపై పలుమార్లు ఎంపీఓ విక్రమ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సదరు అధికారి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తూ బిల్లులను పెండింగ్ పెట్టాడని ఆరోపించారు. దీంతో విసుగు చెంది సోమవారం పంచాయతీ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని. ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బిల్లులు చెల్లించే వరకు ట్రాక్టర్ అప్పగించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై విక్రమ్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా ప్రస్తుతం సర్పంచ్, ఉప సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారి ద్వారా బిల్లులు చెల్లించడానికి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం .. ప్రత్యేకాధికారికి ఇప్పటికే డిజిటల్ కీ రానుందన బిల్లు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. కీ రాగానే బిల్లులు చెల్లిస్తాం. కాగా ప్రస్తుతం గ్రామాల్లో ఈనెల 14 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు డ్రైవ్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీంతో ట్రాక్టర్ లేక చెత్త సేకరణ పనులు నిలిచి పోనున్నాయి.

దళారీ వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యం



ఆఫీసును ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

రేగొండ: దళారీ వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యమని సింజెంటా కంపెనీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని గూడెపల్లిలో సింజెంటా వారి సెంట్రిగో ప్రాజెక్ట్ ఆఫీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహనతో కూడిన నాణ్యమైన ఐపీఎం మిర్చి సాగుచేసే రైతులుగా గూడెపల్లి రైతులు గుర్తింపు పొందారని, అందుకే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏకైక సెంటర్‌గా ప్రాజెక్ట్ గూడెపల్లిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం పూర్తి స్థాయి దళారీ వ్యవస్థను నిర్మూలించి, రైతుకు గిట్టుబాట ధర కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంతోన్నారు. అనంతరం మిర్చిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంపల్లి ప్రసాద్‌రావు, బిజినెస్ మేనేజర్ కొండ భరత్, సెంట్రిగో మేనేజర్ అనిల్ శాస్త్రి, సీడ్ మేనేజర్ మధుకిరణ్, రైతులు పాల్గొన్నారు.

సెలవురోజుగా ప్రకటించాలి

భూపాలపల్లి రూరల్: ఫిబ్రవరి 15 సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును సీఎం రేవంత్‌రెడ్డి ఐచ్ఛిక సెలవురోజుగా ఇస్తున్నట్లు ప్రకటించారని, కానీ పూర్తిస్థాయిలో సెలవురోజుగా ప్రకటించి జీఓ జారీ చేయాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్ నాయక్ సోమవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సేవలాల్ మహరాజ్ జయంతి నిర్వహణకు రూ.10కోట్లు కేటాయించాలని, గిరిజన చట్టాల అమలుకై ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. తమ డిమాండ్లపై ఇటీవల మేడారంలోజాతర సమీక్ష సమావేశానికి విచ్చేసిన మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందించామన్నారు.

జిల్లా స్థాయిలో మెరిసిన గణీషా



బహుమతి అందుకుంటున్న గణీషా

టేకుమట్ల: జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పాటవపోటీల్లో మండలంలోని వెంకట్రావుపల్లి(బి) ఉన్నత పాఠశాలకు చెందిన గణీషా ఆంగ్ల సాహిత్యంలో అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం ఈదులూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, డీఈఓ రాంకుమార్ చేతుల మీదుగా గణీషా బహుమతి అందుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తే మానసికంగా మరింత చురుకుదనంతో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో ప్రతిభను కనబరుస్తారని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. గణీషాను ఉపాధ్యాయులు అభినందించారు.

చెత్తాచెదారం తొలగింపు



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శనకు వస్తున్న నేపథ్యంలో కాటారం నుంచి నస్తూర్‌పల్లి వరకు జాతీయ రహదారి (353 సి) వెంట సోమవారం అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య పర్యవేక్షణలో ప్రత్యేక సిబ్బందితో రహదారికి ఇరువైపుల చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ పేర్కొన్నారు. ఎంపీపీ వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, దేవేందర్, రాంనారాయణ, దేవేందర్, దుర్గారావు ఉన్నారు.

గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాటారం: గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఆ తర్వాతే నూతన నియామకాలు చేపట్టాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రిన్సిపాల్ జె.కె.బుచ్చయ్య, ట్రైట జాయింట్ సెక్రటరీ బి.రాజు, రీజినల్ సెక్రటరీ సిరిసిల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాలలో ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ గురుకులాలు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నవి అని పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో పని చేస్తున్న సుమారు 20వేల మంది ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తయిన తర్వాతే నూతన నియామకాలు చేపట్టాలని, జీఓ 317ను తక్షణమే పరిష్కారం చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని గురుకుల సంస్థలను ఒకే యాజమాన్యం క్రిందికి తెచ్చి ప్రతి ప్రభుత్వ జోఓను తప్పకుండా అమలు చేయాలని, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకం పొందిన వారికే పే, సర్వీస్ ప్రొటెక్షన్ అమలు చేయాలని, డిప్యూటీ వార్డెన్ బాధ్యతలను ఉపాధ్యాయుల నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, రాజయ్య, వంశీ, శ్రావణ్, సారయ్య, సునీల్, సర్ధార్‌సింగ్, గ్లాట, ట్రైట నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడలోని అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలను అర్చకులు యల్లాప్రగడ సూర్యనారాయణశర్మ నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పుష్పార్చన కార్యక్రమాలు, మంత్రపుష్పం , మహానివేదన పూజలు చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీగణపతి హోమం అర్చకులు మణిశర్మ, రామ్మూర్తిలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

ఏటూరునాగారం స్పెషల్ ఆఫీసర్ దామోదరస్వామి దంపతులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమానికి రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కందగట్ల రమేష్, పాయం సాంబశివరావు, గారె రమేష్, చెన్న రాంబాబు, నరేష్, రమణయ్య, నవీన్, మహేష్, సంతోష్, శ్రీకాంత్, రాజేష్, రాధిక, తిరుపతి, భిక్షపతి పాల్గొన్నారు.

మేడారం జాతర డైరెక్టర్లుగా కిషోర్, అయిలయ్య

ఏటూరునాగారం/వెంకటాపురం(ఎం): మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఉత్సవ కమిటీని ఎన్నిక చేశారు. మండల కేంద్రానికి చెందిన చామర్తి కిషోర్‌ను జాతర ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. వెంకటాపురం (ఎం) మండల కేంద్రానికి చెందిన మిల్కూరి అయిలయ్య ఎంపికయ్యారు. అమ్మవార్ల సన్నిధిలో బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు వారు తెలిపారు. డైరెక్టర్లుగా అవకాశం కల్పించిన మంత్రి ధనసరి సీతక్కకు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వారు కృతజ్ఞతలు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని కిశోర్, అయిలయ్య పేర్కొన్నారు.

ఆలయానికి వచ్చిన యువకుడి అదృశ్యం



జగన్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి కుటుంబ సభ్యులతో వచ్చిన గొర్లపల్లి జగన్ అదృశ్యమయ్యాడు. బాసర ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన గొర్లపల్లి జగన్ 13 మంది కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బాసర వచ్చాడు. అంతకుముందు మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నాడు. బాసరలో అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్నారు. జగన్ తన ఫోన్‌ను కుటుంబీకులకు ఇచ్చి ఇప్పుడే వస్తానని బయటకు వచ్చాడు. దర్శనం చేసుకున్న కుటుంబీకులు జగన్ రాకపోవడంతో ఆలయ ప్రాంగణంలో వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. కాగా, గత రెండు నెలల క్రితమే జగన్‌కు వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆలయ సీసీ ఫుటేజీలు పరిశీలించగా క్యూలైన్‌ల నుంచి బయటకు వెళ్తున్నట్లు రికార్డు అయింది. ఎక్కడికి వెళ్లాడనే విషయం తెలియడం లేదు. ఆచూకీ లభిస్తే 99630 43102, 87122 87100 నంబరుకు సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

విద్యార్థులకు కరాటే డ్రెస్‌ల పంపిణీ



పతకాలు అందుకున్న విద్యార్థినులతో ట్రస్టు నిర్వాహకులు

మంగపేట: మండలంలోని కమలాపురం జెడ్పీహెచ్ఎస్ నుంచి రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌లో రెండు సిల్వర్, మూడు బ్రోంజ్ పతకాలు సాధించిన ఐదుగురి విద్యార్థినులకు జ్వాలా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సోమవారం కరాటే డ్రెస్‌లను అందచేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు పేరుతెచ్చిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాటర్‌బెల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వా టర్ ఎక్కువగా తీసుకోకపోవడం వలన అనారోగ్యానికి గురవుతున్నారని ఉదయం, మధ్యాహ్నం సమయంలో వాటర్ బెల్‌కొట్టి విద్యార్థులకు వాటర్ తాగించాలన్నారు. కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్, గౌరవ సలహాదారు కోలగట్ల నరేస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ఏటూరునాగారం: విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యుడు బొస్సరాతి నరహరి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ వైద్య బృందం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేసి రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ పోలికాసిడ్ మందులను అందజేశారు. హెచ్‌ఎం సారంగపాణి, వైద్యులు సుజాత, ఫార్మసిస్ట్ భాస్కర్, ఏఎన్‌ఎం రజిత, అరుణ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి

ములుగు రూరల్: సీపీఐ అభివృద్ధికి ప్రతి కా ర్యకర్త కష్టపడి పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీపీఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీఐ పార్టీలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు భారీగా చేరారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీపీఎం నుంచి మాజీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి ఎండీ.అమ్జద్‌పాషా, బోడ రమేష్, కొయ్యడ లక్ష్మీ, పరంసింగ్, రూప్‌సింగ్ లింగమూర్తి, స్వామి, సాంబు, సారయ్యలు పార్టీలో చేరారు.

ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలి



ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు, కార్యదర్శి చౌలం శ్రీనివాస్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తులు ప్లాస్టిక్ సంచులు వాడకుండా క్లాత్ సంచులను వాడాలన్నారు. ప్లాస్టిక్ నివారణతో పర్యావరణాన్ని రక్షించుకోగలుతామని, స్థానిక ప్రజలు, భక్తులు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. జాతరలో ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఒకరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య, లెక్చరర్ రాజుకుమార్, పీజీ హెచ్‌ఎం రేగ కేశవరావు, ఉపాధ్యాయులు పాపారావు, సుజాత, ఇందిరానగర్, కేజీబీవీ, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉద్యమకారుడిగా గుర్తింపునిచ్చింది కాంగ్రెస్సే’



సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న భిక్షపతిగౌడ్

ములుగు: దశాబ్దకాలంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక కేసుల పాలై తీవ్ర ఇబ్బందులు పడ్డా .. గత బీఆర్ఎస్ ఏనాడూ గుర్తించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక ఉద్యమకారుడిగా గుర్తించి మేడారం మహాజాతర ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా నియమించిందని ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ ఉద్యమకారుడిగా మంత్రి సీతక్క రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ఇన్నాళ్ల ప్రజల మధ్యన ఉండి పనిచేసినా ఏదో లోటు అనిపించిందని, నేటితో అదికూడా తొలిగిపోయిందని అన్నారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు సలహాలు, సూచనలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో తప్పెట్ల కిషన్, బొచ్చు సాంబయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారిపై చర్య తీసుకోవాలి

ములుగు రూరల్: భూ కబ్జాకు సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కామ సునీత అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు మండలం జీవింతరావుపల్లి శివారులో తన తండ్రి బండారి బొందయ్య పేరున సర్వే నంబర్ 298/36, 298/36/అ లో వ్యవసాయ భూమి 10 గుంటల భూమి ఉందన్నారు. ఈ భూమిని తండ్రి దహన సంస్కారాల కోసం వినియోగించేందుకు ఉంచాం. ఇటీవల వ్యవసాయ భూమి పక్కన ఇళ్ల నిర్మాణాలు అయ్యాయి. ఇదే అదనుగా భావించిన ఇస్లావత్ వెన్నెల, కొండబోయిన రవి, మోరె సదయ్యలు పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కై ఇంటి నంబర్ సృష్టించి కబ్జాకు పాల్పడారని అన్నారు. ఆధారాలు లేకుండా పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఇచ్చిన ఇంటినంబర్ ఆధారంగా భూమి కబ్జా చేశారని అన్నారు. కబ్జాకు సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు: సీఐ

వెంకటాపురం(కె): అడవి జంతువులను వేటాడటానికి ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే కఠినచర్యలు తీసుకుంటామని సోమవారం వెంకటాపురం సీఐ బండారి కుమార్ హెచ్చరించారు. అడవి జంతువులను వేటాడే వేటగాళ్లు కరెంట్ తీగలను ఏర్పాటు చేయటంతో పంట పొలాల పనులకోసం వెళ్లే రైతులు, జంతువులు షాక్ గురై ప్రాణాలను కోల్పోతున్నాయని అన్నారు. జిల్లాలో గతంలో ఇలాంటి సంఘటనలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆఫీసర్ అడవిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగిలి ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు. ఎవరైనా అక్రమంగా కరెంటు తీగలు ఏర్పాటు చేసినట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు 8712670114 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.